# పొరపాటు ఎక్కడ ఉంది?

మండు వేసవి. టైము ఒంటిగంట కావస్తోంది. మంచం మీద దొర్లుతున్నారు రామనాధంగారు. సీలింగ్ ఫ్యాన్ వైపు చూసి మరోసారి తిట్టుకొన్నారు విద్యుచ్ఛక్తి వారిని. ఆయన అర్ధాంగి పార్వతమ్మ వంటగదికి ఆనుకొని ఉన్న వరండాలో మంచం వాల్చుకొని మేను వాల్చారు గాలి కోసం. పెద్దబ్బాయి కాలేజికి పట్నం వెళ్లాడు. నిశ్శబ్దంగా ఉంది ఇల్లు. ఆ పల్లె పట్టణాన్కి ఆరు మైళ్ల దూరంలో ఉంది. ఆ గ్రామంలోని భూకామందులలో ఒకరు రామనాధంగారు.

"అమ్మా!" అన్న ఆర్తనాదం రామనాధంగారి చెవిలో పడింది. "ఆ గొంతు తమ అమ్మాయి సుజాతదే? అయినా అమ్మాయి యిప్పుడింత ఎండలో ఎందుకొస్తుంది. ఏవరో అయివుంటారు!" అనుకొని ప్రక్కకు వత్తిగిల్లారు రామనాధంగారు.

వీధి తలుపులు తీసిన చప్పుడయింది.

"అమ్మా! ఆయన పోయారమ్మా!" బావురుమంది ఆమె. ఆమె సుజాతే! సందేహంలేదు! దిగ్గున మంచం దిగారు రామనాధంగారు. గదిలోంచి బయటకు నడిచారు.

వీధి వరండాలో తల్లీకూతుళ్లిద్దరూ కుప్పగా కూలిపోయారు. ఆడపిల్లను చంకలోంచి వదిలింది సుజాత. తాను తల్లి ఒడిలో వాలి భోరున ఏడుస్తోంది.

"ఏమయిందమ్మా?" కూతుర్ని కావలించుకొని అడిగింది పార్వతమ్మ. ఆమె కడుపు చెరువైపోయింది.

"వారు పోయారమ్మా!" ఏడుస్తూనే అంది సుజాత. ఆ అమంగళపు మాటలు విన్న రామనాథంగారు చెవులు మూసుకొన్నారు.

"పోవడమేమిటి? ఎక్కడికెళ్లారు?" కంగారుగా అడిగింది పార్వతమ్మ.

"మమ్మల్ని వదిలి ఎక్కడికో వెళ్లిపోయారమ్మా!" అంటూ గుండెలు బాదుకొంది సుజాత.

"సరిగా చెప్పమ్మా! ఏమయింది?" గద్గద స్వరంతో అడిగారు రామనాథంగారు. ఆయనకు కాళ్లు వణకనారంభించాయి.

"మీ అల్లుడుగారు మమ్మల్ని వదిలేసి ఎక్కడికో పారిపోయారమ్మా!"

ఆ మాట తప్పించి మరోమాట చెప్పకుండా ఏడుస్తున్న కూతుర్ని చూసి, అంత దుఃఖంలోనూ చిరాకు పడ్డారు రామనాథంగారు. పెద్ద మనమడు దిగులుగా తన వైపు చూస్తూంటే గుండె నీరైంది ఆయనకు.

"నాకు తెలుసమ్మా! ఎప్పుడో ఒకప్పుడు వాళ్లు మీ కాపురంలో నీళ్లు పోస్తారని! వాళ్లు మనుషులు కారే తల్లి! ఎంత అవస్థ వచ్చిందే" రాగాలు ప్రారంభించింది పార్వతమ్మ.

"వారిక రారమ్మా! మమ్మల్ని వదిలివెళ్లి పోయారు! పిల్లల్నెలా పెంచుకొంటానమ్మా!" బావురుమంది సుజాత.

"తెలిసుండే ఈ సంబంధం చేసి నీ గొంతు కోశామే తల్లీ! కాంతమ్మ పిన్ని ఆనాడే చెప్పింది! రాక్షసులని తెలుసుకోలేకపోయామే!" తల్లి కూతుళ్ల రాగాలువిన్న రామనాథంగారు సహనాన్ని కోల్పోయారు.

"అబ్బబ్బ! ఏమిటా ఏడుపులు!" విసుక్కున్నారు.

"ఏడుపుకాకపోతే ఇంకేమిటండీ! పాతికేళ్లు నిండలేదు నా పిల్లకు! ఇద్దరు పిల్లలు, ఎలా సాకుతుందో! నా బాధ మీకేం అర్థం అవుతుంది! ఈ సంబంధం వద్దండి అంటే విన్నారు కాదు!"

పార్వతమ్మ రాగాలు వదలలేదు.

ఎదురుగా కొంచెం దూరంలో  ఉన్న కుర్చీలో కూలబడ్డారు రామనాధంగారు.

తల్లీకూతుళ్లిద్దరూ రాగాలు మానలేదు.

"సుజాతా! ఇలా రా తల్లీ!" నెమ్మదిగా పిలిచారు.

అమ్మాయి దగ్గరగా వచ్చాక ఆమె మొఖంలోకి చూశారు. కళ్లు వాచిపోయి ఎర్రగా ఉన్నాయి. కన్నీరు ఏకధారగా ప్రవహిస్తోంది.

"ఇలా దగ్గరకు రామ్మా!" అన్నారు.

ఆమె ఇంకా దగ్గరకు వచ్చాక అడిగారు. "చూడమ్మా! రఘు అంత పిరికివాడు కాదు. బాధ్యత తెలీనివాడు అంతకన్నాకాదు! అతనే తిరిగి వస్తాడు!" ఓదార్చబోయారు.

"ఇక రారు నాన్నగారూ! మా ఇంటి ఆయన ఆఫీసుకెళ్లి కనుక్కొన్నారు! వాళ్లకు తెలియదన్నారు! శలవు కూడా పెట్టలేదట!"

"ఎప్పుడు వెళ్లడమ్మా!"

ఈ వాల్టికి నాలుగు రోజులైంది! రాజమండ్రి బావగారింటికీ, అమలాపురం అక్కగారింటికీ కూడా వెళ్లలేదట!"

ఎలా చెప్పి ఆమెను సముదాయించాలో, అర్థం కాలేదాయనకు.

"ఏమైనా గొడవలు పడ్డారా తల్లీ!" అనునయంగా అడిగారు.

భర్త ప్రశ్నకు చివాలున లేచింది పార్వతమ్మ.

"వారింట్లో రోజూ గొడవలేనండి! అది ఎంత రంపపుకోత అనుభవిస్తుందో మీకేం తెలుసు? చెప్పబోతే చెప్పనిచ్చేవారా ఏమైనానా! అది అత్తవారింట్లో ఎలా ఉంటుందో ఎప్పుడైనా తెలుసుకున్నారా? ఇలా జరుగుతుందని నాకెప్పుడో తెలుసు. వాళ్ళు మనుషులు కాదు, రాక్షసులు!

చూస్తూనే పిల్లని గోతిలోకి తోశాం!"

పార్వతమ్మ మాటలు రామనాథంగారికి కోపాన్ని తెప్పించాయ్. కోప తాపాల కది సమయం గాదని తనను సంబాళించుకొన్నారు.

"ఏమ్మా? ఏమైనా గొడవలుపడ్డారా?" మరలా అడిగారు కూతుర్ని. ఆమె చెప్పడం మొదలు పెట్టింది.

❖ ❖ ❖ ❖ ❖

ఆనాడు సుజాత భర్త పుట్టినరోజు, ఆ వుదయం తొమ్మిదిన్నరకి భర్తకి అత్తగారు భోజనం వడ్డిస్తూ వుంటే "మీ అబ్బాయి మధ్యాహ్నం హల్వా చేయమంటున్నారు!" అంది సుజాత భర్తకి నెయ్యి వడ్డిస్తూ.

"వాడు నీకు యిప్పుడయితే మొగుడయ్యాడుగానీ, కొడుక్కి ఏమిటిష్టమో తల్లికి తెలియదంటే వెర్రిదానా? వాడికి తీపిపదార్థలంటే యిష్టం! పుట్టిన రోజు నాడు హల్వాగానీ, మైసూర్‌పాక్ గానీ చేయించుకుంటాడు!" అంది తల్లి కొడుకుని అప్యాయంగా చూస్తూ.

"ఏమో! ఆయన నాతో అన్నారు. మీతో చెప్పా! మీ అబ్బాయికి ఏమిటిష్టమో మీకుతెలియదనికాదు! దీనికంత వ్యాఖ్యానం చేస్తారనుకోలేదు!"

చిరుకోపం చూపింది సుజాత.

"అవ్వ! నేనేం వ్యాఖ్యానం చేసానే?" అచ్చరువుపోయింది అత్తగారు.

అంతటితో వారివాగ్ధాటిని ఆపు జేయంచాలను కొన్నాడు రఘు, మాటలు మార్చాడు.

"అమ్మా! జీడిపప్పు తెచ్చి అల్మైరాలో పెట్టు!" అన్నాడు.

"హల్వాచేయించమని నాతో ఎందుకు చెప్పాలండి? మీ అమ్మగారితో చెప్పలేకపోయారా?" విరుచుకు పడింది భర్త మీద సుజాత.

"ఎవరితో చెబితేనేం? చేసేది అమ్మ నీకేమైనా చేతనవును కనుకనా?" చిన్నగా విసుక్కొన్నాడు రఘు. గబగబా భోజనం ముగించి, ఆఫీసుకు వెళ్లాడు.

సాయంత్రం నాలుగంటలయింది. భర్త రాకకై ఎదురుచూస్తూ వీధి గుమ్మంలో నిలబడింది సుజాత. తన పుట్టిన రోజునగానీ, ఆయన పుట్టిన రోజు గానీ పిల్లలతో సినిమాకు పోవడం అలవాటు... అయితే ఆరోజు చీకాకుగా వెళ్తూ ఆ విషయం ఎత్తలేదు. అంతకుముందు రోజు రాత్రి ఫలానాసినీమాకి వెళ్లాలని అనుకున్నారు.

తప్పకుండా సినీమాటైముకి ఆఫీసు నుండి వస్తాడనే నమ్మకంతో అతని రాకకై ఎదురు చూడసాగింది. సాయంత్రం ఆరున్నరవరకూ చూసింది. చీకాకు పడింది. అత్తగారు వచ్చాక సినీమాలూ, షికార్లూ బాగా తగ్గి పోయాయ్. వెళ్లవద్దని ఆమె అనడం తానెప్పుడు వినలేదు. "ఎందుకురా అనవసరంగా డబ్బు తగలేస్తారు!" అని కొడుకుతో ఒకటి రెండుసార్లు అనడం మాత్రం వింది. అంటే అర్థం సినీమాలు చూడవద్దనేగా!.

కనుచీకటి పడుతూండగా అత్తగార్కి పిల్లల్కి భోజనం పెట్టింది. చీకటిపడితే అత్తగారు ఏ పనీ చేయలేరు. తడువుకొంటారు. రాత్రయితే ఆమె సహాయం ఎవీంవుండదు. మనవళ్లతో భోజనం చేసి వాళ్లని పక్కలో పడుకోబెట్టు కొని కథలూ, కబుర్లూ చెప్పుకొంటుంది ఆమె.

రాత్రి ఎనిమిది గంటలకి రఘు యిల్లు చేరాడు. 'భోజనం అయిందామ్మా?' వస్తూనే మామూలుగా తల్లిని పలకరించాడు.

తల్లి జవాబు చెప్పక పోవడంతో నిద్రపట్టిందనుకొన్నాడు. పిల్లలు ఆమెను కావలించుకొని పడుకొన్నారు.

"అమ్మ అన్నం తిందా?" అడిగాడు అన్నం వడ్డిస్తూన్న భార్యని వంటింట్లో.

"అలా అడుగుతారేం?" మీ అమ్మగార్కి అన్నం పెట్టడం లేదేమోనన్న అనుమానమా? రోజూ మీతోనే తినమనండి!"

పెడర్థం తీసుకని కస్సుమంది సుజాత.

భార్య జవాబుకి విస్తుపోయాడు రఘు

"మేం భోంచేసామురా బాబూ!" అంది తల్లి తడుముకొంటూ వంటగదిలో ప్రవేశిస్తూ.

రఘు మాట్లాడలేదు.

"పుట్టినరోజు కదా!" స్వీట్ చేయమన్నావ్!" ఇప్పుడట్రా రావడం?" ఆప్యాయంగా అడిగి కొడుక్కి దగ్గరగా కూర్చోందామె.

"ఆఫీసులో అనుకోని పని తగిలింది! ఆలస్యం అయిపోయిందమ్మా!" అంటూ ప్లేట్లో వున్న హల్వాని కొంత తీసి తల్లికి అందించాడు.

"నే తిన్నారా బాబూ!" అంది హల్వా ముద్దను కొడుకు కంచంలో తిరగపడేస్తూ.

"నే పెట్టలేదనేగా మీ అనుమానం?" గంయ్ మంది సుజాత.

కోపంగా భార్యవంక చూసాడు రఘు.

"నీవు పెట్టలేదనీ, ఆమె తినలేదనీ కాదు! నా పుట్టిన్రోజున అమ్మకీ నాచేత్తో పెట్టాలని యిచ్చాను!" అన్నాడు.

"మీరు మాటలు సర్దుకోకండి! ఈ యింట్లో నే నొక్కర్తినే పరాయిదాన్ని! మీ అమ్మగారే అన్నారుగా. ఇప్పుడైతే మిమ్మల్ని కట్టుకొని మీ యింటికి వచ్చానని. మొదటి నుంచీ మీరంతా ఒక్కటే!"

మధ్యాహ్నం ఏదో జరిగి వుంటుందని గ్రహించాడు అతను. ఆ గాలివాన విసురు యింకా తగ్గలేదని అనుకొన్నాడు.

"ఎందుకలా అనుకొంటావ్? ఇప్పుడేమయిందని?" అడిగింది అత్తగారు.

"ఏమయిందా? మధ్యాహ్నం అనవల్సినవన్నీ అనేసి యిప్పుడు ఏమీ ఎరగనట్టుడుగుతున్నారు! మీ తల్లీ కొడుకు లిద్దర్కీ నే నుండడం యిష్టం లేదు!"

కోడలు మాటలకి విలవిల్లాడి పోయింది అత్తగారు.

"సుజాత! ఏవిటా మాటలు? నేనేవిటన్నానని! హల్వా నీవు చేస్తే పదును పోతుంది! నే చేస్తా చూసి తెల్సుకో అన్నానురా బాబూ! అంతే! నా మీద విరుచుకు

పడింది. ఈ ఇంట్లో దాని పెత్తనం పోయినట్లూ, నా యిష్టం చెలామణి అవుతున్నట్లూ బాధపడిపోతుంది. ఎన్నో మాటలు అంది. సహించి వూరుకున్నా! అత్తగారి మీద కోడలు హయం చేసే రోజులు వచ్చాయిరా బాబూ!"

అత్తగారి మాటలకి మరింత కుపితురాలైంది సుజాత.

"కోడళ్ళని రాచిరంపాన పెట్టడవేఁమీకలవాటు. మీ సంగతి పెళ్లికాకముందే తెల్సు! మీ అప్పచెల్లెళ్లు ఎలాంటి వారో మావాళ్ళు నాకు చెప్పారు. మీ అక్కయ్య పెద్ద కోడలు ఎలా చచ్చిపోయిందో కూడా ........"

"సుజా! ఏం మాట్లాడుతున్నావో తెల్సా?" ఘర్జించాడు రఘు. అయినా సుజాత లక్ష్యపెట్టలేదు.

"అవును! ఉన్నమాటే అంటున్నా! మీ ఒదినగారు యింతవరకూ కోడరికం పడి పడి ఆఖరుకు ఎదురు తిరిగింది. అక్కడ మీ అమ్మగారి ఆటలు యిక సాగలేదు ఇక్కడికి వచ్చి పడ్డారు నా పీకలమీదికి. అడ్డమైన వాళ్ళచేత మాటలు తింటూ చచ్చిపడేంతటి కర్మ నా కేంలేదు! ఇది నా యిల్లు! నాయిష్టం!". అని కోడలు ఆగగానే అత్తగారు మొదలు పెట్టింది.

"నా యిల్లూ, నా సంసారం మీ మామగారు పోయిన మరుక్షణంలోనే పోయాయ్ కొడుకులూ కోడళ్ళూ పెట్టే చీవాట్లు తింటూ వారుపోసే గంజినీళ్లు త్రాగి పడుండే రోజులు వచ్చాయ్!".

అత్తగారి మాటలకి మరింత రెచ్చిపోయింది సుజాత.

"చూసారా! ఆమెకు గంజినీళ్లు పోస్తున్నాంట!" తిని లేదంటే దీర్ఘసంకటం పట్టుకొంటుంది.!"

"సుజా!" కోపంతో చేయెత్తాడు రఘు భయపడి వెనక్కి జరిగింది సుజాత.

"ఆఖర్కి మీ అబ్బాయి చేత కొట్టించడాన్కి కూడా సిద్ధపడ్డారన్న మాట! నేను చస్తే మీ అబ్బాయికి మరో పెళ్ళి చేయాలని చూస్తున్నారు! పదిహేను వేలు తగలేసి చేసారు సంబంధం"- ఏడుపు లంకించుకొంది సుజాత.

"అందరికన్నా పెద్దదాన్ని! చావు నాకే ముందు వస్తుందమ్మా! ఆయన మహారాజులా బ్రతికి, పోయారు! ఈ కొడుకులతోనూ కోడళ్ళతోనూ సుఖాలు అనుభవించమని నన్ను వదిలి వెళ్లి పోయారు!"

అత్తా, కోడళ్ల నోళ్లను మూయించలేని నిస్సహాయ స్థితిలో పడ్డాడు రఘు.

" అబ్బబ్బ! ఆపండి! కొంపలో నేను చస్తే అందరికీ బుద్ధి వస్తుంది! ఇది యిల్లు కాదు! నరకం! ఈ యింట్లో వుండేకన్నా సన్యాసుల్లో కల్సి ప్రతి వూరూ తిరిగి ముష్టెత్తుకుంటే హాయిగా వుంటుంది! ఈ కొంపలో వుంటే ఒట్టు!".

అంటూ చివాల్న లేచిపోయాడు. ఆ రాత్రి నడివీధిలో మంచం వేసుకొని పడుకొన్నాడు. మర్నాడుదయం మామూలుగానే లేచాడు. ముభావంగా మసిలాడు. భార్య కాఫీ అందించ లేదు. కొడుకు ద్వారా పంపింది.

పది గంటలవుతూండగా "ఆఫీసు కెళ్ళున్నానమ్మా!" అంటూ కేకే సాడు గదిలోంచి.

"భోజనం చేసి వెళ్లరా బాబూ వంటయిపోయింది!" అన్న తల్లి మాటలను వినిపించుకోలేదు. గబగబా గుమ్మం దిగాడు.

వంట గదిలోంచి గబగబా పరుగు దీసి వీధిగుమ్మంలోకి వెళ్లింది సుజాత, భర్తను పిలవడానికి. అప్పటికే వీధి మలుపు తిరిగిపోయాడు రఘు. నిట్టూర్పు విడిచింది సుజాత.

అలా వెళ్లిన రఘు నాలుగోరోజున కూడా తిరిగి యిల్లు చేరలేదు.

❖ ❖ ❖ ❖ ❖

"ఆయన యిక రారు నాన్నగారూ! మా మీద కోపంతో ఏ అఘాయిత్యం చేసుకొన్నారో! భయంగా వుంది!" అంది సుజాత ఏడుస్తూ.

"ఆఫీసులో అడిగారా?" ప్రశ్నించింది తల్లి.

"మా యింటాయన ఆఫీసుకు వెళ్లి కనుక్కున్నారు. ఆఫీసుకు శలవు కూడా

పెట్టలేదట. అమలాపురంలో వున్న వాళ్ల అక్కకీ, రాజమండ్రీలో వున్న బావగారికీ ఫోన్లు చేసారు, ఎక్కడికీ వెళ్లలేదు"!

"రఘు ఆత్మహత్య చేసుకునేంతటి అవివేకి కాదమ్మా! నీవేమీ భయపడకు! కోపంలో ఎటో వెళ్లి వుంటాడు! తప్పకుండా తిరిగి వస్తాడు!" ధైర్యం చెప్పజూసారు రామనాథం గారు.

"మీరు ఒకసారి వెళ్లి అన్నీ కనుక్కోండి" భర్తను తొందర జేసింది పార్వతమ్మ.

ఆలోచనలో పడ్డారు రామనాథంగారు.

"కూతురి బతుకు యిలా కుక్క చింపిన విస్తరి అవుతుందని ఎన్నడూ వూహించలేదు! బోలెడు కట్నం పోసి మంచి సంబంధం చేసారు. పిల్ల సుఖపడుతుందను కొన్నారు. అంతవరకూ సుఖపడింది కూడా భార్య పిల్లలను అతను ఏనాడూ నిర్లక్ష్యం చేయలేదు. నగా నట్రా చేయించాడు. మరి ఏవిటి విపరీతం? ఇలా ఎందుకు జరిగింది? ఇందుకు ఎవరు బాధ్యులు? అసలు పొరపాటు ఎక్కడ వుంది?"

"ఏమిటండీ మీనమేషాలు లెక్క పెడుతున్నారు? తొందరగా తెమలండి!" మరలా భర్తను తొందర చేసింది పార్వతమ్మ.

"అబ్బాయి వేణూ కాలేజి నుండి రానీ! వచ్చే వేళయింది! ఇద్దరమూ వెళ్తాం! ముందు అమ్మాయికి అన్నం పెట్టు! ఎప్పుడు తిందో ఏమో! దాని సంగతి చూడు! నీ కంగారు చూసి అది మరీ బెంగపెట్టు కొంటుంది! అల్లుడికేమీ పరవాలేదు!" నెమ్మదిగా భార్యను మందలించారు రామనాథం గారు.

పార్వతమ్మ కూతుర్ని లేవదీసి వంటగది లోనికి తీసుకెళ్ళింది. వెనుకటి సంగతులూ (పెళ్ళికి పూర్వం జరిగిన సంగతులు) జ్ఞప్తికి వచ్చాయ్ ఆయనకు.

అప్పటికి సుజాత పెళ్లికి మూడు రోజులే వ్యవధి వుంది. ఆ రోజే సుజాతను పెళ్లికూతిర్ని చేసారు. దగ్గర బంధువులు అందరూ వచ్చారు. ఇంటినిండా చుట్టాలు. తాను పొలానికి వెళ్ళి తిరిగి వచ్చాడు మంచి ఎండలో. ఆడవాళ్లంతా పెద్ద గదిలో

కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నారు పిల్లలు పందిరి క్రింద ఆడుకుంటున్నారు. పెరట్లోకి వెళ్లి చూసాడు. పెళ్లి కోసం కట్టించిన వంటపాకలో వంట బ్రాహ్మడు మిఠాయి చేస్తున్నాడు. అతనికి సహాయంగా వేణూ వున్నాడు. తిరిగి హాల్లోకి వచ్చాడు ఆడవాళ్లంతా హుషారుగా కబుర్లు చెప్పుకొంటున్నారు. తాను వచ్చినట్లు ఎవరూ గమనించలేదు గదికి ఆనుకొని వున్న వరండాలో వాలుకుర్చీ వేసుకొని నేను మేను వాల్చాడు తాను.

గదిలోంచి కాంతమ్మ గారి మాటలు పెద్దవిగా వినిపిస్తున్నాయ్ అంతా శ్రద్ధగానూ, ఆశక్తిగానూ వింటున్నారు. కథ వింటున్నట్లుగా. ఆ కాంతమ్మ తన భార్య పినతల్లికి తోటికోడలుకి అప్ప అవుతుంది.

"ఈ విషయం నీతో చెప్పాలా మానాలా అని వచ్చిన దగ్గర నుంచీ ఆలోచిస్తున్నానమ్మా!" అంది కాంతమ్మ పార్వతమ్మతో.

ఏమిటి చెప్పండి పిన్నిగారు కుతుహలంగా అడిగింది పార్వతమ్మ.

ఈ గౌరమ్మ వుంది చూసావు అన్ని తిరిగింది కాంతమ్మ.

"ఈ గౌరమ్మ? ఎవరండీ?" ప్రశ్నించింది పార్వతమ్మ.

"అదేనమ్మా! మీ వియ్యపురాలు! మేమంతా ఒక వూరి వాళ్ళమేగా, వాళ్లింట్లో ఆమెను గౌరమ్మా అనే పిలుస్తారు!"

"ఆఁ అలాగా చెప్పండి!"

వాళ్ల అప్ప నూకాలు అంటే నూకేశ్వరమ్మ పరమ గయ్యాలి అనుకో. ఈ గౌరమ్మ కూడా అలాంటిదే!"

మీకెలాతెల్సు పిన్నిగారూ! అమాయకంగా అడిగింది పార్వతమ్మ.

"అయ్యో పిచ్చితల్లీ! మేమంతా ఒక వూరువాళ్లమే కదుటే! ఇప్పుడంటే పిల్లలకి ఉద్యోగాలయి యిలా వూళ్ళమ్మట తిరుగుతున్నాంగానీ, వాళ్ళ సంగతులు మా వూరి వెళ్లినప్పుడల్లా తెలుస్తూనే వుంటాయ్!"

"ఏమోనండీ! వారిసంగతులు తెలీవ్! ఎవరూ చెప్పనూలేదు కూడా!"

నిట్టూర్పు విడిచింది పార్వతమ్మ.

"ఎవరుచెబుతారమ్మా? నాలాంటి దగ్గర వాళ్ళుతప్ప? ఈ విషయం నాకు ముందే తెల్సివుంటే ఈ సంబంధం పడనిచ్చేదాన్ని కాదు! అంతా అయిపో యాకతెల్సింది!" నొచ్చుకొందామె.

ఒక్కక్షణం నిశ్శబ్దం. "అవన్నీయిప్పుడెందుకండీ? సంబంధం చేసుకోదల్చినప్పుడు వారితో సర్దుకొని పోవాలి! ఇలాంటి విషయాలు అందరి ముందు యిప్పుడు అనుకోవడం మంచిది కాదు! పెద్దవారు ! మీకు చెప్పాల్సిందాన్ని కాదు!"

వగచివాతపెట్టినట్లు చెప్పింది జయమ్మ. జయమ్మ రామనాథంగారి చెల్లెలు కూతురు. "కావల్సినదాన్ని కాబట్టి చెప్పాను. లేకపోతే నలుగురిలా నేనూ వూరుకొందును! నాకెందుకని! పొరపాటయింది తల్లీ!" కినుక వహించింది కాంతమ్మ.

"జయమ్మ మాటలు పట్టించుకోకండి పిన్నిగారూ! అది చిన్నపిల్ల!" ప్రసన్నురాలిగా మార్చుకొందుకు ప్రయత్నం చేస్తోంది పార్వతమ్మ. కాంతమ్మ మాట్లాడలేదు.

"అయినా పిన్నిగారూ! మీరు ఎప్పటి కబుర్లో చెబుతున్నారు! చిన్నప్పుడు మా సుజాత ఎంత పెంకితనం చేసేదని! ఇప్పుడు దీనంత అమాయకురాలెక్కడా వుండదు!"

నిర్లక్ష్యంగా కొట్టిపారేసింది పార్వతమ్మ. కాంతమ్మ మరల చెప్పడం మొదలు పెట్టింది.

"ఇప్పటికీ వాళ్ళంతేనమ్మా వెర్రిదానా! నూకేశ్వరమ్మ అచ్చం సినీమాలో సూర్యకాంతం అనుకో! దాని పోరుపడలేక కాదా దాని పెద్ద కోడలు నూతిలో పడి చచ్చింది. దాని కొడుక్కి మళ్లీ పెళ్లవడాన్కి పదేళ్ళు పట్టిందనుకో! ఎవరిస్తారు పిల్లని? ఇక నీ వియ్యపురాలు వట్టి ఓర్వలేని మనిషనుకో! కొడుకూ కోడలూ నవ్వుతూ మాట్లాడుకొంటే కంట్లో నిప్పులు పోసుకోబోతే ఒట్టు! పెడర్థాలు తీస్తుంది అన్నింటికీ! దాని పెద్ద కోడలు మా వూరి కరణంగారమ్మాయే కదూ! అది చెబుతూ వుంటుంది! నిలబడితే తప్పుట కూర్చుంటే తప్పుట!"

కాంతమ్మగారి మాటలు తాను వినలేకపోయాడు.

"పార్వతీ!" భార్యను పిల్చాడు కోపంగా. "పిల్చారా నాన్నగారూ"! అంటూ వచ్చింది రెండో అమ్మాయి.

"నిన్ను కాదమ్మా అమ్మను పిలు!" విసుక్కొన్నాడు.

" ఎందుకూ? పనేంటో దాంతో చెప్పండి!" గదిలోంచే కేకవేసింది పార్వతమ్మ.

"ఓసారిలారా!" గట్టిగా పిల్చారు.

"అబ్బబ్బ! ఏవిటండి అర్జంటు!" డిస్టర్బెన్సుకి చీకాకు పడుతూ ఈవతలకు వచ్చింది పార్వతమ్మ.

"కబుర్లు చెప్పుకొంటున్నారు పనులేవి లేవా"?

భార్యమీది విరుచుకు పడ్డాడు తాను. "ఇప్పుడే భోజనాలయాయ్!" నెమ్మదిగా చెప్పింది.

"పెరట్లో బ్రాహ్మడు మిఠాయి చేస్తున్నాడు. వాడి దగ్గర మీ కాంతం పిన్నిని కూర్చోమను! జాగ్రత్తగా వేస్టు లేకుండా చేస్తాడు!" ఆమెను అక్కడ నుంచి పంపేయాలని అతని పథకం.

"ఆమెకు అసలే ఉబ్బసం! నూనె ఎసరు దగ్గర కూర్చుంటే ఇహనడగక్కర్లేదు! డాక్టరు దగ్గరకి మీరే పరుగెత్తాలి! అయినా మన వేణూ వున్నాడక్కడ."

తను మాట్లాడలేక పోయాడు. అయినా వూరుకోలేదు, "సుజాత అక్కడనేవుందా?"

"వుంది! ఫేను వుంది కదా అని అంతా అక్కడ కూర్చున్నాం! మేం కాళీగా కూర్చుంటే మీ కళ్లు కుట్టుకుంటాయ్. మరోగంట పోతే ఎలాగూ వంట గదిలోకి పోక తప్పదు!" విసుక్కొందామె.

"అయితే సుజాతను ఇలా పిలు!"

"అదెలా వస్తుందండీ! కాంతం పిన్ని దాని జడకి మల్లెలు కుడుతోంది!"

ఇక తన మనస్సులో మాట బయటపెట్టక తప్పలేదు.

సుజాత దగ్గర దాని అత్తవారి గురించి అలా చెడ్డగా మాట్లాడ్డం మంచిదికాదు. అత్త వారి మీద దానికి చెడు అభిప్రాయం ఏర్పడుతుంది. అది చాలా ప్రమాధకరం! ఈ విషయం మీ కాంతం పిన్నికి తెలికపోయిన నీకైన తెలియాలి (బుద్ధి లేకపోయిన అని అనాలనుకొన్నాడు కానీ అనలేక పోయాడు) ఆమె హరికథలా చెబుతూంటె మీరు అహా ఓహో అంటూన్నారు. ఆ సంగతులు కట్టిపెట్టమని చెప్పు! లేదా ఆమెను ఏదో మిషమీద బయటకు పంపు! మీకు చేతగాకపోతే నేవచ్చి చెబుతా!"

నిష్కర్షగా చెప్పాల్సింది చెప్పాడు తాను.

"బావుదండీ మీ మాట! అత్తారింట్లో మసలాల్సింది అదేకదా! వాళ్లెలాంటి వాళ్లో తెల్సుకోకపోతే ఎలా?" భయపడుతూనే అంది పార్వతి.

భార్య అమాయకత్వానికీ జ్ఞానహీనతకు ఆశ్చర్యపోయాడు, ఆమెకు అర్ధం అయేలా మరలా చెప్పాలనుకొన్నాడు.

"సుజాత అత్తారు ఎలాంటి వాళ్లో మనకు తెలీదు. వాళ్ల గురించి ఈమె చెప్పింది ఎంతవరకూ నిజమో అసలే తెలీదు. ఇలాంటి విషయాలు సుజాత ముందు అనుకోవడం మంచిది కాదు. చాలా పొరపాటు గూడా. అత్తవారిమీద ఆమెకు చెడు అభిప్రాయం ఏర్పడుతుంది. ఒకసారి ఏర్పడ్డ అభిప్రాయాన్ని మార్చుకోవడం చాలా కష్టం! అదీ ఎన్నో అనర్థాలకి దారి తీస్తుంది. అందువల్ల నష్టపోయేది మనమే! మీ పిన్నిని బయటకు పంపలేకపోతే సుజాతనైన బయటకు పంపు. ఆమె నా విషయాలు చెప్పడం ఆపుచేయమను!"

మారు మాటాడకుండా వెళ్లింది పార్వతి సుజాతను బయటకు పంపేసింది. ఆ సంఘటన తనకు యిప్పటికీ జ్ఞాపకం వుంది. దాని ప్రభావంవల్ల యింతటి విపరీత పరిణామం ఏర్పడుతుందని తానానాడు వూహించుకోలేక పోయాడు. ఇప్పుడు ఏం చేయాలన్న ఆలోచనలో పడ్డారు.

బాగా సాయంత్రం అయింది. పట్నం నుంచి కాలేజీ నుండి తిరిగి వస్తూన్న వేణుతో అల్లుడు కూడారావడం అందరికీ ఆశ్చర్యం వేసింది. ఆ యిల్లు ఆనంద సాగరంలో మునిగిపోయింది.

"మీరిద్దరూ ఎలాకల్సార్రా?" ఆశ్చర్యపోతూ అడిగారు రామనాథంగారు.

"బావగారు బస్‌కోసం జంక్షన్‌లో వున్నారు. బస్ రావడానికి చాలా టైముందని యిద్దరమూ సైకిల్ మీద వచ్చేసాం!" చెప్పాడు వేణూ.

లోనికి వస్తూన్న అల్లునికి ఎదురు వెళ్తూ అడిగింది పార్వతమ్మ.

"ఏమిటి బాబూ! ఇలా హడలి గొట్టేసావ్? ఎక్కడికి వెళ్లావ్?"

జరిగిన విషయమంతా చెప్పాడు అల్లుడు. "ఆ రోజు వుదయం ఆఫీసుకు వెళ్తూంటే దారిలో మెసింజరు ఎదురుపడి టెలిగ్రాం యిచ్చాడు. రాయ్‌పూర్‌లో రైల్వేలో మా స్నేహితుడు పనిచేస్తున్నాడు. వాడూ నేనూ కల్సి చదువుకొన్నాం. వాడి నాన్నగారు వాళ్లబ్బాయితో బాటు నాకూ కాలేజీ చదువు చెప్పించారు. వాళ్లబ్బాయి స్కూటర్ ఎక్సిడెంటులో బాగా గాయపడ్డాడని టెలిగ్రాం యిచ్చారు. నాకేమీ తోచలేదు!" ఏం అయితే మాత్రం యింట్లో చెప్పకుండా వెళ్తావుటయ్యా?" మేమెంతా కంగారుపడుతున్నాం!"

నిలదీసింది అత్తగారు.

"నేచెప్పేదివినండత్తగారూ! నాకేమీ తోచలేదు! స్వంత తమ్మునికే ఏక్సిడెంటు అయినంత కంగారు పడ్డాను వెంటనే ట్రైనువుంది. అక్కడే మా ఆఫీసు గుమాస్తా రామారావ్ కల్సాడు. రామారావు మా ప్రక్క వీధిలో వుంటున్నాడు. ఆఫీసుకి మూడు రోజులు శలవు కావాలని లెటరు రాసి అతనికిచ్చి, యిలా అర్జంటుగా రాయ్‌పూర్ వెళ్తున్నట్లు చెప్పా. అయితే వాడొక మతిమరుపు మనిషి, వాడూ ఆరోజు నుంచీ నాలుగు రోజులు శలవు పెట్టి బెజవాడ వెళ్లాడు. నా విషయం మర్చి పోయాట్ట నా లీవ్ లెటరు ఆఫీసుకు పంపనూలేదు. నా విషయం మా యింట్లో చెప్పనూలేదు. వాడూ ఈరోజు బెజవాడ నుంచి తిరిగి వచ్చాడు. "ఏరా యిలా చేసావ్"? అంటే "వెరీ సారీ బ్రదర్! మర్చిపోయా!" అన్నాడు జరిగిందంతా విని వాడూ చాలా విచారించాడు.

"అంతా అనుకోని విధంగా జరిగి అందర్నీ ఆందోళన పరిచింది! పాపం, మా అమ్మ మంచం దిగలేదు! మీ అమ్మాయి అంటే యిక్కడకు వచ్చేసింది. అదెక్కడకు పోగలదు? మూగ వేదన అనుభవించింది. నే వచ్చేసరికి మా అన్నయ్యా, అక్కాకూడా, వచ్చి వున్నారు. నా కోసం నూతులూ, గోతులూ గాలించాలను కొంటున్నార్ట!

పోలీసుకు రిపోర్టు చేయాలనుకొంటున్నాడు అన్నయ్య".

అంతా విని పకాల్ననవ్వాడు వేణు. మందహాసం చేసారు రామనాధంగారు. కళ్లతో కవ్వింది సుజాత.

"బావుంది నాయనా! మేమంతా హడలి చచ్చాం!" నవ్వాపుకుంటూ అంది పార్వతమ్మ.

బావగారికి కుర్చీ వేసాడు వేణు.

కుర్చీలో కూర్చుని భార్య వైపు చూసాడు రఘు. చిరుకోపం అభినయించింది సుజాత.

"మావయ్యగారూ ఓ విషయం మీతో చెప్పాలని ఎన్నాళ్ళబట్టో అనుకొంటున్నా" అని అడిగారు రఘు.

అంతా అతృతగా అతనివైపు చూసారు చెప్పమన్నట్లు. భర్త ఏమంటారో అని ఆసక్తిగా చూస్తోంది సుజాత.

"నే చెప్పేది మీకు అప్రియంగానే వుండొచ్చు! అయినా సందర్భం వచ్చింది కాబట్టి చెప్పక తప్పదు".

"చెప్పు బాబూ! పొరపాట్లు వుంటే ఎవరైనా సర్దుకోవాల్సిందే!"

"మీ అమ్మాయికి ఓర్పు తక్కువ! అనుమానం ఎక్కువ! దానికి తోడు అహంభావం కూడా వుంది!"

తనవైపు సుజాత కోపంగా చూసినా లక్ష్యపెట్టలేదు.

"ఈ విషయం ఇదివరకెన్నోసార్లు చెప్పాలనుకొన్నా! సందర్భం కుదిరింది కాదు!"

"అమ్మాయికి అనుభవం తక్కువ! పొరపాట్లు వుంటాయ్ బాబూ! సర్దదానికి ప్రయత్నించింది పార్వతమ్మ.

"అసలు పొరపాటు మనదే!" స్వగతం పలుక్కున్నారు రామనాధంగారు. ఆ తర్వాత ఆప్యాయంగా అమ్మాయి వైపు చూస్తూ అన్నారు.

"చూడమ్మా సుజాతా! నా పిల్ల బ్రతుకు పాడైపోయిందని యింత వరకూ ఎంత నరకయాతన అనుభవించానో ఆ భగవంతుడికే తెల్సు! తమ పిల్లల జీవితాలు సుఖమయంగా వుండాలని ప్రతి తల్లిదండ్రులు కోరుకుంటారు. వారు ఆనందమయ జీవితం అనుభవిస్తూంటే చూసి ఆనందించాలని అనుకొంటారు. తమ జీవితం వారి చేతుల్లో కడతేరాలని భగవంతుని ప్రార్థిస్తూ వుంటారు! అది అత్యాశ కాజాలదమ్మా! అది సహజం! ప్రకృతి నైజం! సంసారము అన్నాకా ఎన్నో ఒడుదుడుకులు వస్తూవుంటాయి. శాంతము లేక సౌఖ్యములు లేదు తల్లీ! నిర్మలమైన మనసుతో వున్నవారికి ఎ అపార్థాలూ తోచవు! ఏ అపశ్రుతులూ వినిపించవు! మనిషి యొక్క వ్యక్తిత్వం చేతల్లో కంటే మాటల్లోనే బయట పడుతుందమ్మా!"

సుజాత కళ్ళు అశ్రుపూరితాలయాయ్. "సంసారాన్ని స్వర్గ తుల్యంగా మలచుకోవడమైన, నరక ప్రాయంగా మార్చుకోవడమైన అంతా ఆడదాని చేతుల్లోనే వుందమ్మా!"

"నన్ను క్షమించండి నాన్నగారు!" అంటూ తండ్రి పాదాలపై వాలింది సుజాత.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

20-7-1979